కథ

# ఎదురు దెబ్బ

గరిమెళ్ల విశాలాక్షి

సమయం, సాయంత్రం అయిదు గంటలు. మగవాళ్లు ఆఫీసుల నుండీ, పిల్లలు స్కూల్స్ నుండీ, కాలేజీల నుండీ వచ్చే సమయం.

స్థలం, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్.

డ్యూటీ నుండి వచ్చిన దినకర్ తన క్వార్టర్ ముందు స్కూటర్ ఆపి పార్క్ చేశాడు. ఫస్ట్ ఫ్లోర్‌లో తను పోర్షన్‌లోకి వచ్చాడు. ఇల్లు ప్రశాంతంగా ఉంది. తన సుపుత్రరత్నాలు చంటి, బంటి ఇద్దరూ బుద్ధిగా కూర్చుని చదువుతున్నట్లు నటిస్తూ మధ్యమధ్య దొంగ చూపులు చూస్తున్నారు.

దినకర్ కారేజ్ బాగ్ డైనింగ్ టేబిల్ మీద పెట్టి కుర్చీలో కూర్చుని కాళ్లకున్న షూ విప్పసాగాడు. వంటింట్లోంచి దినకర్ అర్ధాంగి అన్నపూర్ణ ఒక చేత్తో కాఫీ గ్లాస్, మరొక చేత్తో తినడానికి కాబోలు ప్లేట్లో ఏవో పెట్టుకుని నవ్వుముఖంతో వచ్చి అతడి పక్కనే కూర్చుంది. దినకర్‌కి ఇదంతా పజిల్‌లా ఉంది.

సాధారణంగా తను వచ్చే టైముకి కింద పోర్షన్‌లో అన్నపూర్ణ ఆడాళ్లందరితో మీటింగ్‌లో ఉంటుంది. తను వచ్చాకా తీరుబాటుగా ఓ పావుగంటకి మేడ మీదకి వచ్చి 'కాఫీ కావాలి' అని జనరల్‌గా అడిగిన అరగంటకి తెచ్చిస్తుంది. ఇక తన పిల్లలిద్దరూ ఆటకి వెళ్లి ఏడు గంటలదాకా అడ్రస్ ఉండరు. లేదంటే ఇద్దరూ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూఎఫ్ లాగా ఫైటింగ్ సీన్‌లో ఉంటారు. అందుకే తనకి ఇల్లు కన్నా ఆఫీసే బాగున్నట్లు ఉంటుంది. అన్నపూర్ణ ఎక్కడికో అన్నట్లు ముస్తాబై ఉంది. ఏదైనా విషయం ఉంటే తనే చెప్తుంది అని మౌనంగా కాఫీ తాగసాగాడు.

"ఏమండీ మధ్యాహ్నం మా వదిన ఫోన్ చేసింది" ఉపోద్ఘాతంగా అంది.

"ఏంటి విశేషాలు? మీ అమ్మగారు బాగున్నారా?" అని అడిగాడు. దినకర్‌కి ముగ్గురు బావమరుదులు. ముగ్గురూ యమ్.యన్.సి.లలో చేస్తున్నారు. మావగారు పోవడంతో అత్తగారు అందరిళ్ల మధ్య తిరుగుతుంది. ఈమధ్యే ఓ పది రోజుల క్రితం కూతురు దగ్గర్నుండి పెద్ద కొడుకు దగ్గరకి వెళ్లింది. కూతురుకి లేనిపోనివి ఎక్కిస్తుందని అత్తగారంటే మంట అతనికి. కొడుకులతో అల్లుడిని పోల్చి చిన్నచూపు చూస్తుందని కోసం.

"మా వదిన ఈమధ్య ఏదో కంపెనీలో చేరిందట. అహహ ఆగండి, మీ అనుమానం అర్థం అయింది. ఇది ఒక రకమైన బిజినెస్‌ట. ఇంట్లో ఉండే చేసుకోవచ్చు. మనం పదివేలు పెట్టి ఆ కంపెనీ బాగ్ కొనుక్కోవాలి. అందులో అన్నీ ఉపయోగపడే సబ్బులు, పౌడర్లు, టూత్ పేస్టులు ఉంటాయి. అవన్నీ విదేశాల్లో తయారై వచ్చినవి. కాకపోతే వీటి గురించి అందరికీ మనం అర్థం అయ్యేలా చెప్పుకోవాలి. మా వదిన చేరి ఆర్నెల్లు అయిందిట. అప్పుడే లాభాలు కళ్లజూస్తోందిట. మనం నెల నెలా కొంటుంటే, కంపెనీ మనకు కొంత కమిషన్ ఇస్తుంది. ఇదంతా మొదట్లో కొంచెం కష్టంగా ఉంటుంది. కానీ అన్నీ కష్టం అనుకుంటే మనం ఏమీ సాధించలేమని మా వదిన చెప్పింది" కళ్లు పెద్దవి చేసి హావభావాల్తో చెపుతున్న అన్నపూర్ణని కన్నార్పకుండా చూశాడు.

"ఇంతకీ ఫైనల్‌గా ఏం అంటావు?" అతనికిదంతా విసుగ్గా ఉంది. ఏ మాటకామాటే చెప్పుకోవాలి. దినకర్ చాలా కామ్ గోయింగ్. ఇంట్లో పెత్తనం అంతా అన్నపూర్ణదే. అతని గొంతు ఏమాత్రం వినిపించదు. "నేను చెప్పేది ఏం లేదు. మీ ఫ్రెండ్స్, బాగా తెలుసున్న వాళ్లందరి ఇళ్లకూ తీసికెళ్లండి. నేనే చెప్తాను. మధ్యాహ్నం మా వదిన ఫోన్‌లో చెప్పింది, కస్టమర్స్‌ని మన దారికి ఎలా తీసుకురావాలో. అది ఒక ఆర్టంట. రెండ్రోజుల్లో సీడీలు పంపుతాను అంది" ఎటో పోతుంది అనుకున్న పిడుగు తనమీదే పడినట్లు ఫీలయ్యాడు.

అయినా తన వంతు ప్రయత్నంగా "చూడు అన్నపూర్ణా నాకిలాంటివి ఇష్టం ఉండవు. నీకు తెలుసు కదా? అయినా ఇంటింటికీ వెళ్లి మీరు కొనండి, మీరు కొనండి అని బ్రతిమిలాడే బాధెందుకు. నీకు డబ్బే కావాలనుకుంటే హాయిగా బియస్సీ బియ్యీడి చేశావు కదా ఏ స్కూల్లోనో టీచర్‌గా చేరిపో. ఇవన్నీ వద్దు" నచ్చజెప్పే ధోరణిలో అన్నాడు.

అన్నపూర్ణ ససేమిరా వీలు కాదంది. తనని తీసికెళ్లవలసిందేనని పట్టుపట్టింది.

ఇక గత్యంతరం లేక దినకర్ అన్నాడు. "చూడు నేను తీసుకెళతాను. కాకపోతే ఈ విషయంలో నాది ప్రేక్షక పాత్ర. నేనెవర్నీ కొనమని కన్విన్స్ చేయడం కానీ, మంచి చెడ్డలు వివరించడం కానీ చేయను" అన్నాడు. అంతమాత్రానికే సంతోషంగా అంగీకరించింది. పిల్లలిద్దర్నీ ఇంట్లో జాగ్రత్తగా ఉండమని చెప్పి బయలుదేరారు.

దినకర్ బాస్ మిశ్రా ఇంటికి వెళ్లారు. వీళ్లని చూడగానే మిసెస్ మిశ్రా ముఖం అంతా నవ్వులమయం చేసుకుని "రండి రండి" అంటూ వచ్చీరాని తెలుగులో వీళ్లని ఆహ్వానించి కూర్చోడానికి సోఫా చూపింది.

అన్నపూర్ణకి ప్రారంభం చాలా బాగుంది అనిపించింది. అతిథి మర్యాదలు అయ్యాకా అన్నపూర్ణ మనసులోనే రిహార్సల్స్ వేసుకుంది ఎలా మాట్లాడాలో. మిస్టర్ అండ్ మిసెస్ మిశ్రా వచ్చి వీళ్లెదురుగా కూర్చున్నారు.

అన్నపూర్ణ ఇంకా గొంతు సవరించుకుంటోంది. ఈలోగా సడెన్‌గా "మిసెస్ పూర్ణా... అసలు నేనే మీ దగ్గరకు వద్దాం అనుకుంటున్నాను. ఈమధ్య నేనొక స్కీమ్‌లో జాయిన్ అయ్యాను. మనం పదివేలు పెట్టి నాలుగు కూపన్స్ కొంటాము. తిరిగి వాటిని పదేసి వేలకి అమ్మాలి. వాళ్లు తిరిగి ఎనిమిది మందికి అమ్ముతారు. ఆ ఎనిమిది పదహారు మంది అవుతారు. కింద చెయిన్ పెరిగేకొద్దీ పై వాళ్లకి లాభాలు కమీషన్ రూపేణా వస్తాయి. మీకోసం నాలుగు కూపన్స్ రిజర్వ్ చేసి ఉంచేను. మీరు పదివేలు కట్టి జాయిన్ అవండి!" గలగలా చెప్తోంది మిసెస్ మిశ్రా. ఆమె మాటలు నవ్వుతూ ఆమోదిస్తున్నట్లు తలూపుతున్నాడు మిస్టర్ మిశ్రా.

అన్నపూర్ణకి పచ్చివెలక్కాయ గొంతులో పడినట్లయింది. ఆమెకి చెప్పడానికి మాట రాలేదు. భర్త ముఖంలోకి చూసింది. ఆమెని రక్షిస్తున్నట్లు దినకర్ నోరు విప్పాడు. "మేం ప్రిపేర్డ్‌గా రాలేదు సర్. ఏ విషయం ఆలోచించి రేపు చెప్తాం."

'అమ్మయ్య' అనుకుంది మనసులో. "ఇట్స్ ఓకె... టేక్ యువర్ ఓన్ టైమ్" అంటూ నవ్వుతూ సాగనంపారు మిశ్రా దంపతులు.

* * *

బయటకి వచ్చాకా అంది. "నేనొకటి చెప్దాం అనుకుంటే ఆవిడ ఒకటి చెప్తోంది. అయినా పదివేలంటే మాటలా? మన దగ్గర కొనేవాడెవడు?" అంది ఉక్రోషంగా.

"ఏం... మరి నువ్వు, మీ వదిన కలసి అనుకోవడం లేదా? మీ దగ్గర కొనేవాళ్లెవరు? ఏం మీదయితే డబ్బు, వేరొకరిది చిత్తూనా? ఎక్కడైనా ఇలాగే ఉంటుంది. ఇక చాలు ఇంటికి పోదాం పదా" అన్నాడు చిరాకుగా దినకర్.

అయినా ఆశ చావక అన్నపూర్ణ ఊరుకోలేదు. వినుక్కుంటూనే రెండు మూడిళ్లు తిప్పాడు. ఒకరేమో పూనమ్ శారీస్ కూపన్స్ కొనమని, మరొకరేమో గ్వాలియర్ పాంట్స్ స్కీమ్‌లో చేరమని అన్నపూర్ణని బలవంతం చేశారు. చివరకి అన్నపూర్ణ అంది.

"వీళ్లంతా మీ బాస్‌లు కాబట్టి మనం మర్యాదగా తప్పుకు రావలసి వచ్చింది. మీ కింద సబార్డినేట్స్ ఉన్నారు కదా? వాళ్లింటికెళదాం. వాళ్లకెటూ మీరు బాస్ కాబట్టి చచ్చినట్లు మన స్కీమ్‌లో చేరుతారు కదా?" లాజిక్ లాగింది.

ఆమె వంక పిచ్చిదాన్ని చూసినట్లు చూశాడు. అయినా ఓపిగ్గా "చూడూ, నా కింద పనిచేసేవాళ్ల చేత అయితే అసలు కొనిపించలేను. కనీసం మనకి గౌరవం కూడా ఇవ్వరు. చెప్పినా నీకర్థం కాదు వదిలేయి. పద పోదాం" నచ్చచెపుతున్న ధోరణిలో అన్నాడు దినకర్.

ఆ మాటలకి అన్నపూర్ణ "మా అన్నయ్యలు మీ గురించి అనుకునేదంతా నిజమే. మీరు నలుగురితో కలవలేరు. అందుకే మీకేం తెలియదు" అంది తేలిగ్గా.

"సరే నీ ఖర్మ. అక్కడేం జరిగినా నేను బాధ్యుడ్ని కాను" అంటూ వేరే సెక్టార్‌కి స్కూటర్ మళ్లించాడు.

తన కింద పనిచేసే 'రాజు' అనే వర్కర్‌కి తను వస్తున్నట్లు ఫోన్ చేసి చెప్పాడు.

★ ★ ★

రాజు, అతని భార్య వీరికోసమే అన్నట్లు ఎదురుచూస్తున్నారు. నవ్వుతూ ఆహ్వానించారు. అన్నపూర్ణ బాస్ భార్య అనే దర్పం వెలగబోస్తూ తనొచ్చిన పని వివరించింది. తనకి వదినగారు ఫోన్‌లో ఏ విధంగా చెప్పిందో తు.చ. తప్పకుండా చెప్పింది. రాజు భార్య, అన్నపూర్ణ చెప్పేదంతా నవ్వుతూ వింది. ఈవిడైనా కనీసం తన స్కీమ్‌లో చేరకపోతుందా? అని ధీమాగా ఉంది.

ఈలోగా రాజు కల్పించుకుని "సారీ మేడమ్, ఈ విషయంలో మేం ఒకే అభిప్రాయంలో ఉన్నాం. మేం ఇలాంటి స్కీమ్స్‌లో జాయిన్ అవదల్చుకోలేదు" అన్నాడు. ఆ మాటలకి అన్నపూర్ణ అతని భార్య వైపు తిరిగి "చూడండి మీరు ఎంతమంది బ్రదర్స్, సిస్టర్స్?" అనడిగింది.

ఆవిడ "మేం ముగ్గురం సిస్టర్స్, ఒక బ్రదర్" అంది.

"ఇంకేం... మీ సిస్టర్స్, బావగార్లు, బ్రదర్, వదినగారు- వాళ్లని ఒక సండే మన ఆడిటోరియంకి తీసుకురండి. నేను సి.డి.లు తెప్పిస్తున్నాను. ఇంకా ఇందులో చేరితే వచ్చే లాభం గురించి ప్లాన్స్ ఉన్నాయి. అవన్నీ వారికి అర్థం అయ్యేలా వివరిస్తాను" అంది ఉత్సాహంగా.

ఆ మాటలకి రాజు భార్య "అలాగే తప్పకుండా ఇద్దరు వైజాగ్‌లో, ఒకరు విజయనగరంలో ఉన్నారు. కాకపోతే మీరు ఒక వేన్ బుక్ చేయించండి. మరి వాళ్లని పికప్ చేసుకుని తిరిగి డ్రాప్ చేయాలి. ఎందుకంటే వాళ్లు ఖర్చులు పెట్టుకుని ఇంతదూరం వచ్చి ఇవన్నీ వినాలనుకోరు. మావి మధ్యతరగతి జీవితాలు మేడమ్. పావలా తగ్గుతుంది అంటే ఆ వస్తువు కోసం పది మైళ్లు నడిచి వెళ్లి కొనుక్కుంటాం. మీ స్కీమ్ గురించి మేం వినకపోలేదు. ఆ బ్యాగ్‌లో మాకు ఉపయోగపడేది ఏదీ లేదు. అందులో ఉండే కార్ వాష్, కారే లేని మాకెందుకు ఉపయోగపడుతుంది? ఆర్డినరీ సర్ఫ్‌తో పనయిపోయేదానికి ఖరీదయిన ఫ్లోర్ క్లీనర్ ఎందుకు? మీ కంపెనీ పేస్ట్‌లో ఉండేవన్నీ ఆర్డినరీ పేస్ట్‌లో ఉన్నాయి. అందులో ఉండే సబ్బులు, పౌడర్లు, హేరాయిల్స్ ఏవీ కూడా కామన్ మేన్ కొనలేడు. సో, ఎందుకోసం మేం ఈ స్కీమ్‌లో జాయిన్ అవ్వాలి?"

ఆవిడ వాగ్ధాటికి అన్నపూర్ణకి నిలువుగుడ్లు పడిపోయాయి. అమె వేసిన ప్రశ్నలు వేటికీ జవాబు చెప్పలేకపోయింది. ఇంకేం అనలేక "వెళ్లొస్తాం" అని లేచారు. తన భార్యకి బాగా బుద్ధి చెప్పినందుకు మనసులోనే రాజు భార్యని అభినందిస్తూ బయటకు నడిచాడు దినకర్.

★

